క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం: మండలంలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎల్. బ్రహ్మం తెలిపారు. మండలంలోని సోపిరాల, పూల వారిపాలెం, మున్నం వారిపాలెం, పరిశ్రమల ప్రాంతాల్లో ఉదయం సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయూజ మాసం ఆశ్లేష దశమి, గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత



తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తున్న కవి శ్రీరామచంద్రమూర్తి రెడ్డి

చినగంజాం: తెలుగు భాష పరిరక్షణ కోసం అంతా పాటు పడాలని కవి, సాహితీ వేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల లో తెలుగు భాష ప్రాముఖ్యత, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగుభాష గొప్పదనాన్ని, ప్రాముఖ్యతను, తెలుగు భాషలో సౌలభ్యాన్ని, భావితరాలకు తెలుగు భాష అందించేందుకు చేయాల్సిన పనులను ఆయన వివరించారు. ఎస్. నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను బుధవారం ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా హనుమంతరావు తెలిపారు. ఈ సంవత్సరం కూడా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు బి.సాల్మన్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పండగ పూటా పనే..!

- వేటపాలెం మండలంలో పనిభారంతో సతమతమవుతున్న సచివాలయ ఉద్యోగులు
- సచివాలయ వ్యవస్థ పై పగపట్టిన కూటమి ప్రభుత్వం
- తాము చెప్పినట్లు చేయండి, లేదంటే వెళ్లి పొండంటూ బెదిరింపులు
- సర్వే పేరిట సిబ్బందికి వేధింపులు



వేటపాలెం: సుపరిపాలన కోసం నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ క్రమేపీ మసకబారుతోంది. ఈ వ్యవస్థని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం విశేషం. ప్రభుత్వం చేయిస్తున్న సర్వేలతో సతమతమవుతన్నారు. వలంటీర్లుగా మారిన వీరు.. సెలవుల్లో కూడా తీరక లేకండా తిరుగుతున్నారు. వేటపాలెం మండల పరిధిలో తొమ్మిది గ్రామ పంచాయతీలకు గాను 19 గ్రామ సచివాలయాలున్నాయి. 76 వేలుకు పైగా జనాభా ఉన్నారు. వీరందరి కోసం 150 మందికి పైగా సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే వారి పనులకు తోడు సెలవు దినాలు, పండుగల నాడు కూడా వదలకుండా బలవంతంగా సర్వేలు చేయిస్తుండడంతో ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

ఇవే ఆ సర్వేలు..

ప్రస్తుతం మనమిత్ర, కౌసల్యం, పీ4, రైస్ కార్డుల పంపిణీ, వాహన డేటా, ఆధార్ సీడింగ్, చైల్డ్ విత్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల వంటి వాటి కోసం ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కానీ తమ సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని.. తమకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, కేడర్ మార్పు, ప్రమోషన్లు, పారదర్శక బదిలీలు వంటి వాటిని చేపట్టాలని కోరుతున్నారు. కాని ప్రభుత్వ వాటిని తుంగలో తొక్కుతున్నారని విమర్శిస్తున్నారు.

గతంలో సేవలు ఇలా..

స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 2019 అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. వాటి కోసం ఊరూరా శాశ్వత ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లారు. ఒక్కో సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, వెల్ఫేర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంరక్షక శాఖ అసిస్టెంట్, ఉద్యాన శాఖ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను నియమించారు. అధికారం చేపట్టిన ఏడాదితోనే గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వ పాలనను కొత్త పుంతలు తొక్కించారు. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలు నేరుగా గడప వద్దకే చేర్చారు. కానీ నేడు అదే ఉద్యోగులు బానిసలుగా మారామని ఆందోళన చెందుతున్నారు.



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

శాశ్వత పశువైద్యుడిని నియమించలేరా?



మాట్లాడుతున్న రమణారెడ్డి

చీరాల టౌన్: వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఆధారపడేది పశువుల పెంపకం, జీవాల పెంపకం. కానీ జీవాలకు రోగాలు వస్తే చికిత్సలు చేసే పశువైద్యులు లేక రూరల్ గ్రామాల్లోని పశు పోషకులు, జీవాల పెంపకందారులు అల్లాడుతున్నా పట్టించుకోని స్థితిలో కూటమి సర్కార్ ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి విమర్శించారు. బుధవారం గవినివారిపాలెంలో గొర్రెల పెంపకందారులు పడుతున్న ఇబ్బందులను ఆయన పరిశీలించారు. గవినివారిపాలెంలో పశువైద్యశాల ఉన్నప్పటికీ శాశ్వత పశువైద్యులు లేక గొర్రెలు, మేకల పెంపకం దారులు, పశుపోషకులు అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. గవినివారిపాలెం పశువైద్యశాల పరిధిలో దేవినూతల, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాల్లో పశుపోషణ, జీవాల పెంపకందారులు అధికంగా ఉన్నా కానీ శాశ్వత పశువైద్యులు లేక జీవాలు రోగాల పాలై సకాలంలో వైద్యం అందక మృతి చెందుతున్నాయన్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు వచ్చినా వైద్యం అందించలేని దుస్థితిలో కూటమి సర్కార్ ఉందని ఎద్దేవా చేశారు. రైతులు, పశుపోషకుల పట్ల కూటమి సర్కార్ కపట ప్రేమ చూపుతుందే కానీ వారికి కావాల్సిన సదుపాయాలు, ప్రత్యేక పథకాలు, రాయితీలు, వైద్య సేవలు, అవసరమైన మందులు అందించడంలో తీవ్రంగా విఫలమైందని దుయ్యబట్టారు. గవినివారిపాలెం పశువైద్యశాలకు శాశ్వత వైద్యుడిని నియమించి, జీవాలకు సకాలంలో వైద్య సేవలందించకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. బాలకోటి రెడ్డి, దేవ సహాయం, జీవాల పెంపకందారులు, పశుపోషకులున్నారు.

అభివృద్ధిలో ముందడుగు

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ ఎస్.విజయ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఇంటి పన్నుల వసూళ్లు చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, సబ్బులు అందిస్తున్న సంఘ సభ్యులు



కొరిశపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పర్చూరు: చేతులు కడుక్కొనే విధానాన్ని చూపుతున్న అధ్యాపకులు

వేటపాలెం: చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక సర్వోదయ కాలనీల వద్ద గల విద్యార్థులు, జీడి పప్పు కార్మికులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సబ్బులు, వాటర్ బాటిళ్లు ఉచితంగా అందజేశారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కలుషితం కాని నీరు తాగాలన్నారు. నున్న శివ ప్రసాద్‌రావు, శరత్‌బాబు, లక్ష్మణ్, శ్రీమన్నారాయణ, హెచ్ఎం డి. శివపార్వతి, గిరిజ, నరసింహారావు, కోడె రంగారావు, జయశ్రీ పాల్గొన్నారు.

కొరిశపాడులో గ్లోబల్ హ్యాండ్‌వాష్

మేదరమెట్ల: గ్లోబల్ హ్యాండ్‌వాష్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కొరిశపాడులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటిస్తూ బయట నుంచి వచ్చిన వెంటనే కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. పరిశుభ్రతను పాటించడం వలన అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. మండల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పర్చూరు: హ్యాండ్ వాష్ పై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరికి ఎంతో ముఖ్యమని ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రధానమైనదని చెరుకూరు ఎన్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బెంజిమన్ హనోక్ అన్నారు. పాఠశాలలో బుధవారం గ్లోబల్ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేందుకు అవసమైన సూచనలు ఆయన చేసి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన ముఖ్య అంశాల్లో చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ప్రథమ చర్య అన్నారు. చేతులు కడుగుకునే విధానాన్ని విద్యార్థులకు స్వయంగా చూపించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఉదయభాస్కరరెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పర్చూరు(చినగంజాం): హ్యాండ్ వాష్ చేయడం ద్వారా సంక్రమిక వ్యాధులను నివారించవచ్చని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజువా వంటి సూక్ష్మజీవులు వల్ల వ్యాపిస్తాయని ఇవి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించకుండా ఉండాలంటే హ్యాండ్ వాష్ తప్పనిసరి అన్నారు. రోజూ భోజనం చేయబోయే ముందు, అలాగే మల, మూత్ర విసర్జన తరువాత కచ్చితంగా ఏడు దశలుగా చేతులు శుభ్రపరచుకునే హ్యాండ్ వాష్ విధానాన్ని అనుసరించాలని సూచించారు.

కోటి సంతకాలతో గుణపాఠం చెప్పాలి



కొప్పరపాడులో కోటి సంతకాల బ్రోచర్ ఆవిష్కరణ



సంతమాగులూరు: కోటి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

బల్లికురవ: కూటమి ప్రభుత్వం దోచుకో–దాచుకో అనే నినాదంతో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రయివేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తోందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి మండలంలోని కొప్పరపాడు, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, సూరేపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో మెడికల్ కళాశాలల ప్రవేటి కరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా బ్రోచర్ల ఆవిష్కరించి, సంతకాల సేకరణ చేపట్టారు. మక్కెన రవిబాబు, ప్రత్తిపాటి అక్కులు, ఏ. సతీష్, గెల్లా హరిబాబు, గనసమనేని వెంకటబ్రామి రెడ్డి పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి, తంగేడు మల్లి, మిన్నెకల్లు, గ్రామాల్లో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. అడివి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ అందజేత

వేటపాలెం: మండల పరిధిలోని వివిధ హైస్కూల్స్ విద్యార్థులు 150 మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ అధ్యక్షుడు పింజల శ్రీనివాస్‌జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణరావు శ్రీమన్నారాయణ, కనపర్తి మాల్యాద్రి, పెండెం పోతురాజు పాల్గొన్నారు.

అద్దంకి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు. ఏపీ ఐక్యపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తగా ప్రచురించారు. చక్రాయపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో కేవీ శ్రీనివాసరావు, ఇ. రామారావు, బి. పూర్ణచంద్రరావు, అంకారావు, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, శ్రీనివాస రెడ్డి, హనుమంతరావు, పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



వలపర్లలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



చినగంజాంలో ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న అభిమానులు



ఇడుపులపాడులో కలాంకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మార్టూరు : దేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు మండలంలోని వలపర్ల గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల అబ్దుల్ కలాం విగ్రహానికి పాఠశాల ఉపాధ్యాయులు, కొమ్మి ఫౌండేషన్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): మానవతా మూర్తి అబ్దుల్ కలాం అని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు గురించి మాట్లాడారు. భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో...

స్థానిక మసీదు పేటలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచం గరి్వంచదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు యువతకు మార్గ నిర్దేశకుడు.. జీవితాంతం దేశ ప్రతిష్ట కోసం తపించిన దేశ భక్తుడు మాజీ రాష్ట్రపతి భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు పఠాన్ సుభాని ఖాన్, షేక్ ఈసూబ్, మసీద్ ప్రెసిడెంట్ నబీ షా, షేక్ అన్వర్, షేక్ జియావుల్ హక్, పఠాన్ బాబు, లక్ష్మణ్, బాలాజీ, ఇర్ఫాన్, జాకీర్, షఫీ, బాషా, పాంటింగ్ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ప్రసన్నలక్ష్మి

చినగంజాం: మండల కేంద్రం చినగంజాం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అందుకు అధికారులు సహకరించాలని మండల ఉపాధ్యక్షురాలు తుమ్మలపెంట ప్రసన్న లక్ష్మి కోరారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ ప్రసన్న లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చినగంజాం ప్రాంతంలోని మోటుపల్లి పంచాయతీ పరిధిలో కాకతీయుల కాలం నాటి గణపతి దేవుడు, రుద్రమదేవి నిర్మాణం చేసిన వీరభద్ర స్వామి దేవాలయం, కోదండ రామస్వామి ఆలయం, మున్నం వారిపాలెం పంచాయతీ పరిధిలో బౌద్ధ ఆరామ క్షేత్రాలు, పెదగంజాం పంచాయతీ పరిధిలో ఖగోళ, వాస్తు శాస్త్ర ప్రావీణ్యంతో నిర్మాణం చేసిన భావన్నారాయణ స్వామి దేవాలయం, పల్లెపాలెం, రాజుబంగారు పంచాయతీ పరిధిలోని తీరంలో సముద్రంలో కలిసే పొడవైన కాలువ, సంతరావూరు పంచాయతీ పరిధిలో పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయన్నారు. శాఖలకు సంబంధించిన అధికారులు ఆయా శాఖల పరిధిలోని ప్రభుత్వ పథకాలు, అమలు చేస్తున్న పథకాలు, ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. ఎంపీడీఓ కె. ధనలక్ష్మి, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు ముఖ్యం

పర్చూరు(చినగంజాం):

పార్టీ బలోపేతం కావాలంటే గ్రామ స్థాయి కమిటీలే ముఖ్యం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. బుధవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో నియోజక వర్గంలోని పర్చూరు, కారంచేడు మండలాల విస్తృత స్థాయి సమావేశం ఆయా మండలాల కన్వీనర్లు కఠారి అప్పారావు, జువ్వా శివరాం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కమిటీల జాబితాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలను చర్చించడం, పార్టీని ముందుకు తీసుకెళ్ళేందుకు అవసరమైన సూచనలు అందజేయడం ద్వారా పార్టీ బలంగా ఉంటుందన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు పార్టీని నిలబెట్టేందుకు కృషి చేయాలని సూచించారు.



గ్రామ కమిటీల జాబితా తయారు చేయడంలో నిమగ్నమయిన మధుసూదనరెడ్డి, నాయకులు

ఓటరు క్లైంల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్‌లెవల్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న (బీఎల్‌వోలు) విధులను సమర్థవంతంగా నిర్వహించి ఓటరు క్లైమ్‌ల విచారణ వేగవంతంగా చేయాలని ఈఆర్‌ఓ, ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో చీరాల నియోజకవర్గంలోని బీఎల్‌వోలతో ఆర్డీవో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 106 చీరాల నియోజకవర్గంలో ఓటరు క్లైమ్ అర్జీలు పెండింగ్‌లో లేకుండా బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఓటరు క్లైమ్ అర్జీని నిశితంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అవాంతరాలు లేకుండా విచారణ చేయాలన్నారు. అభ్యంతరాల వివరాలను తెలియజేయాలన్నారు. ఇటీవల మృతిచెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లోని ఓటర్ల పూర్తి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. క్లైమ్‌ల విచారణలో ఈసీ నిబంధనల ప్రకారం చేయాలని ఇష్టానుసారంగా విధులు నిర్వహించవద్దన్నారు. బీఎల్‌వోలకు ఉన్న ప్రతి సమస్యలను తనకు గానీ, ఏఈఆర్వోలకు గానీ తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.గోపీకృష్ణ, ఎన్నికల డీటీ సుశీల, మున్సిపల్, వేటపాలెం మండలాల్లోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.